# నేను నేనే-20

## Index                                                    Page no


253. మనసా వాచా కర్మణా "ఎలా" అన్న ప్రశ్నను వదిలేయడమే జ్ఞానసిద్ధి 2

254. దేవుని లీల - జీవుని గోల 4

255. దైవేచ్ఛ-పురుషప్రయత్నం 6

256. తనను తాను కూడా  మార్చుకోవాల్సిన అవసరం లేదని గ్రహించినవాడు న్యూఎనర్జి-అద్వైతి 8

257. ఉన్నచోటనే ఉండండి-నిశ్శబ్దం – మౌనం 15

258. తనువుకు బయట కూడా నేనున్నాను 22

259. నీ మెలకువే సకలానికి మెలకువ. నీ మోక్షమే సకలానికి మోక్షం. 28

260. మీరు చూచేవాడిని చూచేవారు-యుద్ధం 34

261. నీవు లేవు అని తెలుసుకో...అంటే నేను ఏదో ఒకచోట లేను, అంతటా వ్యాపించి ఉన్నాను అని తెలుసుకో 36

## 253. మనసా వాచా కర్మణా "ఎలా" అన్న ప్రశ్నను వదిలేయడమే జ్ఞానసిద్ధి

ప్ర: నేనుతో, నేనులో, నేనుగా ఉండిపో... అని చాలా సులువుగా చెప్పేశారు...

కానీ అలా ఎలా? అనేదే అర్థం కావడం లేదు...

బాబు: "ఎలా" అనే దానిని వదిలేయండి...

దైవానుభవం, మరణానుభవం రెండూ ఒకటే. "నీవు ఉండవు".

ప్ర: ఓహో, అలాగా...

బాబు: నీవు ఉండి, దైవానుభవాన్ని పొందటం కల్ల.

ప్ర: ఓహో... "నేను పోవటం" అనేది

నా వల్ల అవుతుందా? లేక దానికదే జరుగుతుందా?

బాబు: దానికదే జరుగుతుందని కఠోపనిషత్తు చెబుతోంది...

ఎవరికి సాక్షాత్కరించాలో ఆత్మే ఎన్నుకుంటుంది.... అనే వాక్యం ఉంది కఠోపనిషత్తులో...

ప్ర: అయితే మనం ఉన్నట్లు ఉంటే సరిపోతుందన్న మాట...

బాబు: అదే కదా మేం మొదట్నుంచి చెబుతున్నది...

Be as you are...నీవు నీవుగా ఉండు...

అన్నారు భగవాన్.

ప్ర: ఇది అర్థం కాకపోయినా, మీరు చెప్పినట్లు "నేను ఆత్మను" అని అనుకుంటూ దాన్ని నిజం చేసుకోవాలని ప్రయత్నిస్తున్నాను...

బాబు: నేను ఆత్మను అంటే, నేను ఆత్మను కాను అని దాని అర్థం.

నేను మగవాణ్ణి, మగవాణ్ణి అనుకుంటూ ఉంటే ఎలా ఉంటుందో ఆలోచించండి...

మగవాడు కాదేమో అని అనుమానం వస్తుంది అందరికీ...

ప్ర: మరి ఎలా?

ఈ "ఎలా" అనే ప్రశ్న మీకు నచ్చదు మరి.

బాబు: "ఎలా" అనేది వదిలేస్తే అక్కడే ఉంటుంది ఆత్మ.

ప్ర: అవునండి...యూజీ గారు కూడా అదే చెప్పారు...

బాబు: మనసా వాచా కర్మణా "ఎలా" అన్న ప్రశ్నను వదిలేయడమే జ్ఞానసిద్ధి.

## 254. దేవుని లీల - జీవుని గోల

నది సముద్రం చేరగానే ప్రవాహం ఆగిపోయినట్లు

సద్గురు సన్నిధి చేరగానే వ్యవహారం ఆగిపోతుంది.

ఏదో పోగొట్టుకోవాలనిగానీ,

ఏదో పొందాలనిగానీ రెండూ ఉండవు.

బ్రతకడానికి ఉపాయాలు దొరుకుతాయేమోనని వస్తారు చాలామంది ఇక్కడకి.

ఒక్క ఉపాయం కూడా దొరకదు.

(అహం)చావడానికి చాలా ఉపాయాలు దొరుకుతాయి...

అందుకు ఇష్టపడే వాళ్లే నిలుస్తారు ఇక్కడ.

దీపం పురుగు దీపానికి ఆకర్షింపబడి అందులో పడి నాశనమైనట్లు

అలా గురుతత్త్వానికి ఆకర్షింపబడి, తనకు తానుగా కోల్పోవడానికి ఇష్టపడేవాళ్లే నిలుస్తారు ఇక్కడ.

* * *

ప్రపంచం అనేది అజ్ఞానజాతర.

ఆ గోల నుండి తప్పించుకోవడానికే గురుదర్శనం.

గురువు గడప వద్ద విడిచే చెప్పులు వద్దనే నిలిచిపోతుంది మాయ.

సద్గురు సన్నిధిలో ఉన్నంతసేపు ఆత్మస్వరూపంగానే ఉంటాం...

అలా నిశ్చలమనస్సుతో ఉంటాం...

ఇంకేమీ అవసరం లేనిస్థితిలో ఉంటాం...

తిరిగి చెప్పులు తొడుక్కోగానే మళ్లీ తగులుకుంటుంది ఆ సంసారపిశాచం.

ప్రపంచానికి, పరమాత్మకు మధ్య వారధి

గురుదర్శనం...

వారధికి ఇవతల ఉండలేం...

వారధిపైనే ఉండలేం...

వారధిని దాటేసే సాహసమూ చేయలేకున్నాము...

మాయ - బ్రహ్మము ఇద్దరూ కలిసి ఆడే ఆటలో

"షటిల్ కార్క్" లా ఉన్నాము...

వారికి క్రీడ.

మనకు పీడ.

వారికి లీల.

మనకు గోల.

తల(బుద్ధి) ఉన్నంతవఱకు తలరాత తప్పదు.

తలరాత ఉన్నంతవఱకు నా ఈ రాతలు తప్పవు.

పరమేశ్వరా!

నా వద్ద నీవు మాట పడకూడదనుకుంటే-

గణేశుడికి లాగే...

తల(అజ్ఞానం) తీసి

తల(జ్ఞానం) పెట్టు...

నీకు తెలిసిన విద్యే కదా...!

* * *

## 255. దైవేచ్ఛ-పురుషప్రయత్నం

మనిషి జీవితాన్ని శాసించి నడిపేది

విధియా? లేక మతియా?

అనగా దైవేచ్ఛయా? లేక పురుషప్రయత్నమా?

అనేది అనాది కాలం నుంచి మనిషి మెదడును తొలుస్తున్న ప్రశ్న.

"ఈ రెంటికీ ఏకమూలమైన తనను ఎఱిగినవారు అవి తొలగినవారు." అన్నారు భగవాన్

తనను ఎఱుగడం అంటే-

దైవేచ్ఛ (దేవుడు)

పురుషకారం (జీవుడు)

రెండూ తానే అని తెలియడం.

దర్శకుడుగా తెర వెనుక

స్క్రిప్ట్ రెడీ చేయడం - దైవేచ్ఛ.

అతడే ఓ నటుడుగా తెరపైన

స్క్రిప్ట్ ప్రకారం నటించడం - పురుషకారం.

పురుషకారము అనేది కూడా దైవేచ్ఛయే

అని ఉన్నవాడు - భక్తియోగి.

దైవేచ్ఛ అనేది కూడా పురుషప్రయత్న ఫలమే

అని ఉన్నవాడు - కర్మయోగి.

తెరపైన ఉన్నవాడు, తెరవెనుక ఉన్నవాడి కోసం

ప్రయత్నం చేయడం లాంటిదే ఈ ఆధ్యాత్మిక సాధనలన్నీ.

వాడే వీడు.

వీడే వాడు.

చంటబ్బాయి సినిమా చూస్తే సరి.

వెతికేవాడే చివరికి దొరికేవాడు.

## 256. తనను తాను కూడా  మార్చుకోవాల్సిన అవసరం లేదని గ్రహించినవాడు న్యూఎనర్జి-అద్వైతి.

గురుసన్నిధిలోకి వెళ్లి కూర్చోగానే,  ఏ ప్రశ్నలూ వేయకనే, గురువునుంచి ప్రబోధాన్ని పొందే ఏకైక శిష్యుడు బాబు....

తప్పు.

గురువు అంటేనే సమాధానం.

శిష్యుడు అంటేనే ప్రశ్న.

ఏ ప్రశ్నా వేయక, గురువు ముందు ఊరికే కూర్చున్నా సరే,  నోరు తెరచి ప్రశ్నించినవానితో సమానమే.

ఆవు మౌనంగా వచ్చి మన వాకిట నిలబడుతుంది ప్రతిరోజూ...

"నాకు ఏదో ఒక ఆహారం పెట్టండి" అనే ఆ ఆవు మౌనానికి అర్థం.

అలాంటిదే బాబు మౌనం కూడా...

"నాకు ఏదో ఒక ప్రబోధాన్ని పడేయండి..." అని అడిగినట్లే.

అందువల్లనే ప్రబోధిస్తారు గురువుగారు...

బాబు "అడగకపోవడం"లో అడగడం అనేది ఉంది.

బాబు మౌనం నిజంగా అడగకపోవడమే అయితే,

గురువు నుంచి ఏ ప్రబోధమూ జాలువారదు. అదే గుర్తు బాబు నిజమైన మౌనానికి.

జాలువారింది అంటే ఇక్కడ పల్లం(ప్రశ్న ) ఉన్నట్టే లెక్క.

* * *

ద్వారబంధం అనేది బయటకు సంబంధించినదా? లోపలికి సంబంధించినదా? అడిగారు గురువుగారు నా వైపు చూచి...

రెంటికీ సంబంధించినది...అన్నాను.

"ఆ ద్వారబంధమే బాబు" అన్నారు...

ఇహానికి, పరానికి మధ్య ఉన్న ద్వారబంధం బాబు. బాబుకు ఇహమూ తెలుసు, పరమూ తెలుసు...

కానీ బాబుకు బాబు గురించి తెలియదు...యెప్పటికీ తెలియదు...

బాబును తెలుసుకోవడానికి బాబే అడ్డం... అన్నారు.

* * *

రెండు ఉండే ఒకటి - ఒకటి.

రెండు లేని ఒకటి - ఒకటి.

"నేను బాబు" అన్నదాంట్లో

బాబు అనేది - రెండు ఉండే ఒకటి.

"నేను" అనేది - రెండు లేని ఒకటి.

* * *

1. నేను__________

2."నేను"__________

మొదటి నేను ప్రక్కన ఉన్న ఖాళీలో "బాబు" అని వ్రాస్తేనే సరిపోతుంది.

రెండవ "నేను" ప్రక్కన ఉన్న ఖాళీలో ఏమివ్రాసినా సరిపోతుంది.

మొదటి నేను, రెండవ "నేను" గా మారుకోవడమే మోక్షము.

అనగా బాబు అని వ్రాస్తే మాత్రమే సరిపోయే నేను,

ఏమి వ్రాసినా సరిపోయే "నేను"గా మారుకోవడమే

మోక్షము.

* * *

నేను పుట్టక మునుపు,

నేను మరణించాక

ఉన్న "నేను" యొక్క అడ్రసు ఎవ్వరికీ తెలియదు.

అనగా జనన-మరణ రహస్యం ఎప్పటికీ రహస్యమే.

* * *

ఐదో తరగతి వాడికి-

ఒకటో తరగతి వాడు అజ్ఞానిలా కనిపిస్తాడు.

పదో తరగతివాడు జ్ఞానిలా కనిపిస్తాడు.

ఇంతకీ తాను(ఐదవతరగతివాడు)

జ్ఞానియా? అజ్ఞానియా?

పోలిక వలన మాత్రమే జ్ఞానాజ్ఞానములకు ఉనికి.

ఏ పోలికా లేక కేవలుడుగా ఉన్నవాడు మాత్రమే

నిజమైన జ్ఞాని.

నిజానికి-

అజ్ఞాని అంటే, మారువేషంలో ఉంటూ ఎవరికీ తెలియబడక ఉన్న జ్ఞాని అని అర్థం...వీడు పాస్ అయినట్లు లెక్క...

జ్ఞాని అంటే మారువేషం బట్టబయలు చేసుకుని, అందరికీ జ్ఞానిగా తెలియబడినవాడు అని అర్థం... వీడు ఫెయిల్ అయినట్టు లెక్క.

ఇప్పుడు చెప్పు...ఎవడు గొప్ప?

పాస్ అయినవాడా? ఫెయిల్ అయినవాడా?

అని అడిగారు రవికుమార్ వైపు తిరిగి...

పాస్ అయినవాడే(అజ్ఞానే) గొప్ప అన్నాడు

రవికుమార్.

ఈ క్రొత్త క్రొత్త అర్థాలకు అందరికీ నవ్వొచ్చింది...

* * *

చెప్పేవాడు గురువు

వినేవాడు శిష్యుడు అనుకుంటే,

విద్యార్థి టీచర్ కు పాఠం అప్పజెప్పుతుంటాడు...

అప్పుడు చెబుతున్న విద్యార్థిని గురువు అనాలి.

వింటున్న టీచర్ ను శిష్యుడు అనాలి.

అవును...ఇదే వాస్తవం.

ప్రవచనం చెప్పే ప్రవచనకర్త, టీచర్ కు పాఠం అప్పజెప్పే విద్యార్థి లాంటివాడు.

ఆ ప్రవచనం వినే శ్రోత టీచర్.

అంతేగాని వినేవాళ్ళు తెలియనివాళ్ళు అనుకుని ప్రవచిస్తే, ఆ ప్రవచనకర్త తప్పులో కాలువేసినట్లే.

* * *

శుద్ధోధన తనయుడు ఏ పరిస్థితులను చూచి చలించి, విరాగియై భార్యాబిడ్డలను వదిలి తపస్సు చేసి జ్ఞానం పొంది బుద్ధుడయ్యాడో

ఆ తరువాత అవే పరిస్థితులు లోకంలో ఉన్నా కూడా విచలితుడు కాలేదు.

మార్పు కలిగింది తనలోనేగానీ, లోకంలో కాదు.

కాబట్టి మార్పు రావలసింది తనలోనేగాని, లోకంలో కాదు...అన్నారు గురువుగారు.

లోకంలో మార్పు తేవడానికి ప్రయత్నించేవాడు - సంఘసంస్కర్త.

తనలో మార్పు తేవడానికి ప్రయత్నించేవాడు - ఆధ్యాత్మికుడు.

తనను తాను కూడా ప్రయత్న పూర్వకంగా  మార్చుకోవాల్సిన అవసరం లేదని గ్రహించి ప్రశాంతంగా ఉండే వాడు న్యూఎనర్జి-అద్వైతి. ఎందుకంటే తనతో సహా ఈ లోకంలో ఉన్నవన్నీ (జీవజగదీశ్వర్లు) సహజంగా ప్రతిక్షణం క్రొత్త క్రొత్తగా మారుతూనే ఉంటాయి కాబట్టి.

* * *

already బరువుతో నిండిపోయిన బుర్రను

మరో బరువు చేర్చేవాడు కాదు గురువంటే.

"బరువు తగ్గించుకోవడం ఎలా?" అనే టైటిల్ గల ఐదు కేజీల పుస్తకాన్ని నెత్తినబెట్టినట్టు ఈ గురువులు చేసే ప్రబోధాలు కూడా...

జ్ఞానమంటే-

విషయజ్ఞానంతో బుర్రను నింపేయడం కాదు.

జ్ఞానమంటే-

బుర్రను ఖాళీ చేసేయడం.

అదే పనిలో నిమగ్నమయి వుంటారు సద్గురువు... శిష్యుల విషయంలో...

మరి మీరు గురుప్రబోధాలను ఇన్ని వ్యాసాలుగా వ్రాస్తున్నారు కదా అంటారేమో...!!

అందుకు సమాధానంగా గురువు మాటల్నే చెప్పుకుందాం-

నేను ఇప్పటివరకు ఒక్క అక్షరం కూడా పలుకలేదు.

బాబు ఇప్పటివఱకు ఒక్క అక్షరం కూడా వ్రాయలేదు.

అదీ పూర్ణం.

ఇదీ పూర్ణం.

* * *

## 257. ఉన్నచోటనే ఉండండి-నిశ్శబ్దం - మౌనం.

దక్షిణామూర్తి సన్నిధిలో పరివేష్ఠించి ఉన్న మునుల వలె, నేనూ నా స్నేహితులు

సద్గురు సన్నిధిలో పరివేష్ఠించి ఉన్నాం...

ఏ మాటా లేక, చాలాసేపు నిశ్శబ్దంగా కూర్చున్నాం...

ఆ నిశ్శబ్దం కాస్త మౌనంగా మారుకుంది...

మాట ఆగితే - నిశ్శబ్దం.

మనసు ఆగితే - మౌనం.

మౌనమే స్వరూపంగా కలిగిన సద్గురువులో

ఉద్దేశపూర్వకమైన ఓ స్పందం కలిగి, అది మనసై, ఆ మనసు మాటై, ఆ మాట దివ్యోపదేశంగా మాకు అనుగ్రహించబడుతుంది.

ఆ భాషణం మళ్లీ మమ్మల్ని మౌనంలోకి తీసుకెళుతుంది...

యెందుకంటే ఆ భాషణం మౌనంలోనుంచే వచ్చిందిగనుక.

అందుకే అది మౌనభాషణం...

వారు మాట్లాడినా మాట్లాడనట్టే...

మనకు "ఏకం" అంటే ఏంటో తెలియక, అన్యంతో వేగులాడుతూ, గందరగోళంలో ఉంటాం కనుక

మనం ఊరికే ఉన్నా కూడా మాట్లాడుతున్నట్టే...

* * *

ఏదో ఊరు నుంచి ఒక జిజ్ఞాసి వచ్చాడు రాత్రి...

ఈరోజు ఉదయం కాసేపు సత్సంగంలో గడిపి, శివాలయం వెళ్లి, తిరుగుప్రయాణం కావడం...అనేది అతని ప్రోగ్రాం...

గుడికెళ్లడం అంటే, ఇది(గురుసన్నిధి) గుడి కాదనే కదా...! అన్నారు గురువుగారు...

గట్టిగా నవ్వాడు అతను...

* * *

సద్గురు: నీవనుకునే పవిత్రమైన క్షేత్రాలు, తీర్థాలు ఉండేది భూమ్మీదే...వాటిని మోసే భూమి ఇంకెంత పవిత్రమైనది! నీవుండేది కూడా ఆ భూమ్మీదనే...

కాబట్టి నీవు ఉన్నచోటనే ఉంటే పోలా...!

మీ ఇంటి కిటికీ ద్వారా చూసే ఆకాశం కంటే

మా ఇంటి కిటికీ ద్వారా చూసే ఆకాశం పవిత్రమైనది అనుకోవడం లాంటిదే...ఒక చోటును పవిత్రక్షేత్రం అనుకోవడం కూడా.

అన్ని చోట్లా ఉండేది ఆ ఒక్క "చిదా"కాశమే...

కాబట్టి ఉన్న చోటనే ఉంటే పోలా...!

గిరిప్రదక్షిణం చేసి బయలుదేరిన చోటుకే చేరుకుంటావు...

అంత సంబడానికి బయలుదేరినచోటనే ఉంటే పోలా...!

"అన్ని క్షేత్రాలలో ఉండే దేవుడు ఒక్కడే"

అంటే దాని అర్థం అన్ని క్షేత్రాలకు వెళ్లి దర్శించిన నీవే ఆ ఒక్కడు అని అర్థం.

క్షేత్రాలు, దేవతామూర్తులు...అనేకం ఉంటాయి...

చూచేవాడు(ద్రష్ట) ఒకడే కదా!

దేవుడొక్కడే అనటంలో అంతరార్థం అదే.

"ద్రష్టే దేవుడు" అని.

ప్ర: దృష్టిం జ్ఞానమయీం కృత్వా పశ్చేత్ బ్రహ్మమయం జగత్సాదృష్టిః ......

సద్గురు: నిజమే...ఆ చదువేదో ఉన్నచోటనే ఉండి చదువుకుంటే పోలా..!

కానీ...మేమూ తిరిగి తెలుసుకుంటాం...అంటారు.

ఏం చేస్తాం? తిరగమంటాం...

తెలుసుకునే వరకు తిరగవలసిందే...తప్పదు.

* * *

ఉన్నచోటనే ఉండేవాడు - జ్ఞానయోగి.

గురువాక్యం నమ్మి ఉన్నచోటనే ఉండేవాడు - భక్తియోగి.

ప్రయత్నపూర్వకంగా శ్రమపడి తెలుసుకునేవాడు - కర్మయోగి.

* * *

సద్గురు: మాకు తెలిసినవారొకరున్నారు...

ఆకాశానికి నమస్కారం పెట్టు అంటే, ఆరుబయటకెళ్ళి, తలపైకెత్తి ఆకాశానికి నమస్కారం పెట్టి వచ్చాడు...

ఇప్పుడు మన మధ్యన ఉండేది కూడా ఆకాశమే కదా...? ఇక్కడే నమస్కారం చేసివుండొచ్చు కదా! అంటే, అప్పుడు నాలిక్కరచుకున్నాడు...

ప్ర: "ఇది కూడా గుడే అని తెలిశాక కూడా అక్కడకెళ్లాలి, ఇక్కడకెళ్లాలి...అని ఎందుకనిపిస్తుంది గురువుగారూ...?

సద్గురు: దాని పేరే "కర్మ"....

పైగా "తిరగడం"లో సదుద్దేశం ఏమీలేదు వీడికి...

వాడి(దేవుడి) సీటును తాను కొట్టేయాలన్నదే కడుపులో భావన.

(అందరూ నవ్వుకున్నారు)

ప్ర: ఇప్పటివరకు మీరు 6 సిగరెట్లు కాల్చారు గురువుగారూ...!

సద్గురు: నీవు ఇక్కడకు ఎందుకొచ్చావో...!

దేనిని గమనిస్తున్నావో...!

ప్ర: మీరెందుకు సిగరెట్టు కాలుస్తారు...? అని.

సద్గురు: ఒక్కొక్క సిగరెట్టు....ఏ మూలో ఉన్న ఒకరి కర్మను దగ్ధం చేస్తుంది...

ప్ర: అయితే, నా కర్మను కూడా దగ్ధం చేయండి గురువుగారూ...!

సద్గురు: నీ కర్మ దగ్ధం అయ్యాకే, నీవిక్కడ అడుగు పెట్టగలిగావు...

* * *

"గతం"లోకి జారుకున్న ప్రతీవాక్కూ అది దైవవాక్కే.

ప్రతి సంఘటనా దైవేచ్ఛయే...అన్నారు గురువుగారు.

ఈరోజు దైవేచ్ఛ ఏమనేది రేపు తెలుస్తుంది.

ఈరోజు మనకు అర్థంకాని సంఘటనను

రేపు దానిని "దైవేచ్ఛ"గా మనం అర్థం చేసుకోవాలి.

"జరిగింది" కనుక.

* * *

నేను-నాది మొత్తం నాకిచ్చేయ్...

నేను-నాది మొత్తం నీకిచ్చేస్తాను...

అన్నారు గురువుగారు.

కాసేపాగి-

నీవు "నేను-నాది" మొత్తం నాకు ఇచ్చేశాక

నేను ఇచ్చే "నేను-నాది" మొత్తాన్ని నీవు తీసుకోవడమనేదే ఉండదు.

యెందుకంటే, అసలు నీవు లేవు కదా...! అన్నారు.

ప్ర: "నేను-నాది" మొత్తాన్ని మీకు ఇచ్చివేసినందుకు గుర్తేమి?

బాబు: ఇద్దరు ఉండరు....

శిష్యుడు-గురువు, జీవుడు-దేవుడు

ఇలా ఇద్దరుండరు...

(నా సమాధానాన్ని గురువు అంగీకార సూచకంగా చిరునవ్వుతో ఊరకున్నారు)

* * *

"నేను" అనేది తెర.

నేను ఫలానా అనే నామరూపాల వ్యవహారం, తెరపై కదలాడే దృశ్యం.

* * *

శివుడు లేకుండా శక్తి ఉండదు.

శక్తి "లేనట్లు" ఉంటాడు శివుడు.

కానీ శివుడు శక్తియుతుడే.

## 258. తనువుకు బయట కూడా నేనున్నాను...

ప్ర: "తనువు ద్వారా జీవుడు దేవుణ్ణి చూడడం సాధన.

ఆ తనువు ద్వారానే దేవుడు జీవుణ్ణి చూడడం సిద్ధి."

అన్నారు గురువుగారు...

వివరించండి...

* * *

బాబు: జ్ఞానము - ఆంతర విషయము.

లోకము - బాహ్య విషయము.

ఈ రెంటికీ ద్వారబంధం - ఈ దేహం.

బయట నుంచి లోపలికి వెళ్లడానికి,

లోపల్నుంచి బయటకు రావడానికి

రెంటికీ తనువొకటే మార్గం.

* * *

తనువుకు లోపలకెళ్లేకొద్దీ సూక్ష్మమైపోతావు.

అది సూక్ష్మ శరీరం(జ్ఞానము)

తనువుకు  వెలుపలకొచ్చేకొద్దీ స్థూలమైపోతావు.

అది స్థూలశరీరము(లోకము)

మనసుకు, లోకానికి మధ్య ద్వారబంధం - దేహం.

గడపకు లోపలుండి జగత్తును చూస్తే

నీవు దేవుడవు.

గడపకు బయట ఉండి దేవుణ్ణి చూస్తే నీవు జీవుడవు.

* * *

"లోకము, జ్ఞానము ఇవి యేకముగఁ బుట్టి నశించినను, జ్ఞానము చేతనే లోకము వెలుగును. లోక జ్ఞానములకు భవ లయ స్థానమై భవ లయములు లేక వెలుగు పరిపూర్ణమైనదియే ఆ వస్తువు" అన్నారు భగవాన్ ఉన్నది నలుబదిలో.

1. మనసు

2. లోకము

ఈ రెండూ పుట్టి, లయించే స్థానం "నేను".

ఈ "నేను"కు భవలయాలు లేవు.

సదా ఉంటుంది.

"నేను"కు లోపల వెలుపల లేవు.

అంతటా ఉంటుంది.

***

ప్ర: గడపకు లోపలుండి జగత్తును చూస్తే నీవు దేవుడవు. గడపకు బయట ఉండి దేవుణ్ణి చూస్తే నీవు జీవుడవు.

అన్నారు... వివరించండి...

బాబు: దేహం గడప లాంటిది.

ప్రస్తుతం నీవు గడపగా ఉన్నావు.

గడపకు లోపల నీవు ఉండి, ఈ తనువుతో సహా జగత్తును సాక్షిగా చూస్తున్నప్పుడు నీవు దేవుడవు.

గడపకు ఈవల(అనగా జగత్తులో) నీవు ఉండి,

దేవుణ్ణి ఓ దృశ్యంగా ఓ రూపంగా చూడాలనుకుంటే నీవు జీవుడవు.

అరుణాచలంలో ఉన్న ఒకతను కూడా ఇదే అడిగాడు-

'నేను ప్రత్యక్షంగా ఈ కళ్లతోటే భగవంతుణ్ణి చూడాలి' అని.

'ఒకవేళ అలా కనబడ్డా, ఇప్పుడు చూస్తుండే భ్రాంతిమయ దృశ్యం కంటే భిన్నమేమీ కాదు' అన్నాను.

'భ్రాంతి రూపమే అయినా సరే భగవంతుణ్ణి చూడాలి' అన్నాడు పట్టుదలగా.

ఒక రకమైన భ్రాంతిని వదిలి, మరో రకమైన భ్రాంతిని కోరుకోవడం తప్పించి ఇంకేమీ లేదు అతని కోరికలో.

'సరే తీవ్రంగా భావించు... నీ తీవ్రభావనే నీవు కోరుకునే రూపంగా సాక్షాత్కరిస్తుంది...' అని చెప్పాను, ఇంతకు మించి నా వద్ద సమాధానం లేక.

* * *

ఇవాన్స్ వెంట్జ్ అనే విదేశీయుడు భగవానులను ఇలా ప్రశ్నించాడు-

'భగవాన్! ఆత్మసాక్షాత్కారానికి మీకెంత కాలం పట్టింది?' అని.

'నామరూపాల వ్యవహారమే ఈ ప్రశ్నకు కారణం.'

అంటారు భగవాన్.

* * *

నామరూపాల పరిధిలో సమాధానం లేదు.

ఆ పరిధి దాటితే ప్రశ్న లేదు.

ఒక్కొక్కరికి ఒక్కొక్కసారి ఒక్కొక్క ప్రాంతంలో ఒక్కొక్క తేదీలలో మోక్షం కలుగుతుంది అనేవన్నీ తప్పుడు భావనలే.

* * *

కనేవాడు దేవుడు.

కనబడేవాడు కాదు.

దేవుడు చూసే జీవుడు దేవుడే.

జీవుడు చూసే దేవుడు జీవుడే.

సాధన వలన దేవుడు కనబడడు.

కనబడేదంతా దేవుడే అని తెలుస్తుంది.

* * *

సద్గురువు చెప్పిన పై ఆరు వాక్యాలు అవగాహన అయితే చాలు. సాక్షాత్కారం గురించిన confuse పోతుంది.

* * *

కెరటం కూడా సముద్రమే అయినప్పటికీ, పైకి ఎగసి పడడం వలన, ఓ రూపం, 'కెరటం' అనే నామం ఏర్పడింది. ప్రత్యేక నామరూపాలు దానికి ఏర్పడినప్పటికీ, అది సముద్రమే.

అలాగే చిత్ స్వరూపమైన పరబ్రహ్మములోనే అంతర్గతంగా ఉన్న మహామాయ అనే ఓ చలనం వలన ఈ తనువు, జగత్తు ఏర్పడ్డాయి.

తనువు, జగత్తు స్వరూపతః పరబ్రహ్మమే అయినప్పటికీ మాయ వలన ప్రత్యేకమైన నామరూపాలు ఏర్పడ్డాయి.

బాహ్యాంతరాలు(బయట-లోపల) అనేవి ఈ దేహం ఉండటం వల్లనే ఏర్పడ్డాయేగానీ, వాస్తవానికి తన స్వరూపం అనంతం.

ఈ పరిమితమైన దేహంలో ఉండి, తనకు విడిగా ఈ జగత్తును నీవు చూస్తుండడం వలన నీవు జీవుడైనావేగాని, నీవు జీవుడవు కావు.

తనువుకు బయట కూడా నేనున్నాను...

నేను ఈ తనువు మాత్రమే కాను...

'జగత్తుతో కలిపి నేను' (totality) అని ఉన్నప్పుడు

నీవు దేవుడవు.

"పరిమితుల్ని తొలగించుకో" అనేదే సారాంశం.

నీ చిన్న పరిధిని నీవు తుడిపేయ్! చాలు.

నీవు అనంతుడివి అవుతావు.

అందుకు ఏకైక మార్గం- తనువుకు వెలుపల కూడా నేనున్నాను...అని భావిస్తూ ఉండడమే.

ఈ భావన ఘనమై,

"నాతో సహా సర్వమూ నాలో ఉన్నట్లున్నది"

అనే అనుభవం కలుగుతుంది.

అనగా-

'నేను' మాత్రమే సత్యము.

సర్వము - అసత్యము.

ఈ జ్ఞానమే మోక్షము.

## 259. నీ మెలకువే సకలానికి మెలకువ. నీ మోక్షమే సకలానికి మోక్షం.

ప్ర: నేను పోయాక కూడా ఈ ప్రపంచం ఇలానే ఉంటుంది...మిగతావారంతా జీవించేవుంటారు అన్న ఒకే ఒక్క తప్పుడు భావనే కారణం మృత్యుభయముండడానికి...అని అన్నారు దయచేసి వివరించండి.

బాబు: పూర్వకాలంలో 'పేమయ్యస్వామి' అనే పేరుతో భిక్షువులు ఉండేవారు. వారు గుర్రం మీద ఊళ్లూళ్లు తిరుగుతుండేవారు. ఇంకొకడు గుర్రం ముందు డప్పు వాయిస్తూ ఉండేవాడు, ఊళ్లోకి పేమయ్యస్వామి వచ్చాడని తెలియజేయడానికి.

ఊరివారందరూ వచ్చి స్వామికి దక్షిణలు సమర్పించి ఆశీర్వాదాలు తీసుకునేవారు. సాయంత్రం అయ్యేసరికి ఇద్దరూ సమంగా పంచుకునేవారు.

ఇక్కడ ఓ తమాషా అయిన విషయం ఏమంటే, ఈ వూళ్లో గుర్రం మీద కూర్చున్నవాడు, పక్క ఊళ్లో డప్పు వాయిస్తాడు, డప్పు వాయించేవాడు గుర్రం మీద కూర్చుంటాడు.

ఇలా సాగుతుంది వారి జీవనయాత్ర.

* * *

ఊరూరా తిరుగుతూ నాటకాలు ప్రదర్శించే ఓ నాటకసంస్థలో ఒక నటుడు ఈరోజు ధర్మరాజు వేషం వేస్తే, మరో రోజు, మరో చోట దుర్యోధనుడి వేషం వేస్తాడు. సమయ సందర్భాలను బట్టి పాత్రలు, పాత్రధారులూ మారుతూ ఉంటారు...

ఇలా సాగుతుంది వారి జీవనయాత్ర.

* * *

జీవుని పాత్రా అంతే.

ఒక జన్మలో ధర్మాత్ముడు...

మరో జన్మలో దుర్మార్గుడు...

ఈ విషయంలో స్వ+ఇచ్ఛ తప్పితే

ప్రారబ్ధమూ లేదు, విధీ లేదు.

'దేవుడు' అంతకన్నా లేడు.

ముందుగానే స్క్రిప్ట్ నీకు నీవే వ్రాసుకుని తెరపైకి వచ్చావు. అదే తలరాత, అదే విధిరాత.

తెరవెనుక  స్క్రిప్ట్ వ్రాసుకునే తానే - దేవుడు.

తెరముందు నటించే తానే - జీవుడు.

దేవుడు, జీవుడు అంటూ ఇద్దరు లేరు.

నటనలో పూర్తిగా మునిగిపోయి...

స్క్రిప్ట్ వ్రాసింది కూడా తానే అనేది మరచిపోయి...

ఈ జీవితంలో సుఖాలు వచ్చినప్పుడు మాత్రం, సుబ్బరంగా అనుభవిస్తూ...

బాధలు వచ్చినప్పుడు మాత్రం 'ఎవ్వనిచే జనించు....' పద్యాలు పాడుకుంటూ ఉంటాడు.

సుఖాలు కంటే కష్టాలే మనిషిని అంతర్ముఖుణ్ణి చేస్తాయి.

"ఓ...ఈ స్క్రిప్ట్ వ్రాసుకుంది నేనే" అని గుర్తుకు తెచ్చుకుని నవ్వుకుంటావు.

స్క్రిప్ట్ అని తెలిసాక-

సుఖదుఃఖాలు రెండూ నవ్వులాటగానే ఉంటుంది.

నటుడికి పాత్ర ముఖ్యం. అంతే.

అది మంచిదా? చెడ్డదా? అని ఆలోచించడు.

అలా ఆలోచించేవాడు అసలు నటుడే కాదు.

స్క్రిప్ట్ అని తెలిసాక మహానటుడుగా ఉంటాడు ప్రపంచంలో.

రావణాసురుడు అంతటి పరమదుర్మార్గుడు

తెర వెనుక వైకుంఠద్వారపాలకుడు అనేది గుర్తుంచుకోవాలి.

* * *

'నేనే' ప్రధాన దేవత.

మిగతా అందరూ(గురువుతో సహా) పరివారదేవతలే.

అందరి స్క్రిప్టులూ నా స్క్రిప్ట్ లో భాగాలే.

అందరి ప్రారబ్ధాలూ నా ప్రారబ్ధంలో భాగాలే.

కలలో వేలమందిని చూచినా సరే

మెలకువ రాగానే నేనొక్కణ్ణే ఉంటాను.

జగత్తు యావత్తు నా స్వప్న జగత్తే.

ఈ మహాస్వప్నానికి నేనే కేంద్రం.

మెలకువ కలిగేవరకు కలలో ఎవడో ఒకడు గురువుగా, దేవుడుగా ఉంటాడు.

మేలుకోగానే  గురువు, దేవుడు నేనే అవుతాను.

నేను అంటే బాబు కాదు...

బాబు కూడా కలలో భాగమే.

కలలో-

మరణించినవాడు మరణించినవాడూ కాడు.

జీవించి ఉన్నవాడు జీవించి ఉన్నవాడూ కాడు.

మెలకువలో-

ఇద్దరూ ఉండరు.

"నేను మేలుకున్నాక కూడా కలలోనివారి జీవితాలు అలాగే ఉంటాయి" అని భావించడం ఎంత అజ్ఞానమో,

"నేను పోయాక కూడా ఈ ప్రపంచం ఇలానే ఉంటుంది" అని అనుకోవడం  కూడా అంతే అజ్ఞానం.

"నేను పోవడం" అంటే-

స్వప్నజగత్తు చెదిరిపోవడం. అంతే.

మళ్లీ మరో స్వప్నాన్ని కనడానికి సమాయిత్తమౌతావు...అదే పునర్జన్మ.

స్వప్నానికి-స్వప్నానికి మధ్య విరామం మరణం.

కాబట్టి మోక్షం అంటే మరుజన్మ లేకపోవడం కాదు;

ఎఱుకతో ఎన్ని జన్మలైనా ఎత్తడానికి సంసిద్ధంగా ఉండడం.

"ఇదొక స్వప్నం" అన్న మఱుపే దుఃఖం.

"ఇదొక స్వప్నం" అన్న ఎఱుకే సుఖం.

* * *

"ఇది ఒక కల" అని మనం ఉత్తుత్తినే అనుకుంటున్నాం. అంతే.

మాటవరసకు అనుకుంటన్నాం. అంతే.

ఇదొక కల అని నిజంగా ఉంటే నిన్ను బాధపెట్టేది ఏదీ ఉండదు.

సుఖపెట్టేది కూడా ఏదీ ఉండదు.

సుఖదుఃఖాలు రెండూ ఉండవు కాబట్టే,

దానిని 'పరమసుఖం' అన్నారు.

* * *

ఇంతకీ మేలుకున్నాక ఏముంటుంది? అని బాబు అడిగితే,

"మెలకువలో మెలకువే(జ్ఞానమే) ఉంటుంది..."

అన్నారు గురువుగారు.

* * *

ఉపనిషత్తు కాలం నుంచి... వివేకానంద నుంచి... సద్గురువు వరకు చెప్పిన అంతిమ సందేశం-

మేలుకో - మేలుకో....అని.

* * *

నీ మెలకువే సకలానికి మెలకువ.

నీ మోక్షమే సకలానికి మోక్షం.

* * *

## 260. మీరు చూచేవాడిని చూచేవారు-యుద్ధం

ప్ర: యుద్ధం జరుగుతోంది.

చిన్నారులు అని కూడా చూడకుండా చంపేస్తున్నారు. చూస్తూ ఓర్వలేని బాధ ఒక్కోసారి గుండెల్ని పిండేస్తుంది.

నువ్వొచ్చాకే ప్రపంచం వచ్చింది అన్న గురువుగారి మాటలు నీకేమాత్రం అర్థం అయ్యాయో ఇప్పుడు చెప్పు అని ఎవరో వెక్కిరించినట్టుంది.

ఏదన్నా చెప్పండి బాబుగారూ.

బాబు: అవన్నీ న్యూస్ పేపర్, T.V. వార్తలే...

అవి మీకు ప్రత్యక్షానుభవంలో లేనివే...

పేపర్, టీవీ ఆ రెండూ వదిలేయండి...

మీకేదైతే ప్రత్యక్షానుభవంలో ఉందో అది మాత్రమే ఉంది.

సత్యమింతే.

సత్యం కఠినంగా ఉంటుంది.

"కఠినం" అంటే నా ఉద్దేశంలో మనం ఊహించుకున్న భావాల్ని, మనం నిర్మించుకున్న భవనాల్ని నిర్ద్వంద్వంగా సత్యం త్రోసిపుచ్చుతుందనే...

వాస్తవానికి సత్యం చాలా సరళమైనది.

సున్నితమైనది, ఆహ్లాదకరమైనది.

నిజానికి నీ కళ్ల ముందు ఏదైనా ఘోరం జరుగుతున్నా సరే,  అది టీవీలో కనబడే దృశ్యం లాంటిదే.

1. చూడబడేదంతా అసత్యం.

2. చూచేవాడు సత్యం.

ఈ రెండు వాక్యాలు జీర్ణమైపోయి, మీ రక్తంలో కలిసిపోవాలి. అంతే.

ఇంతకు మించి ఏ వేదాంతమూ లేదు;

ఏ పరిష్కారమూ లేదు.

మీరు చూచేవాటిపై జాలి చూపడం కాదు;

చూచేవాడిని చూసి జాలిపడండి.

మీరు  చూచేవారు  కాదు;

మీరు చూచేవాడిని చూచేవారు.

అంతే.

**261. నీవు లేవు అని తెలుసుకో...అంటే నేను ఏదో ఒకచోట లేను, అంతటా వ్యాపించి ఉన్నాను అని తెలుసుకో**

గురువుగారు తన ప్రబోధామృత వర్షాన్ని కురిపించడానికి సంసిద్ధమైనారు...

నా వైపు తిరిగి -

"టైం వేస్ట్ చేశాడు...అని అంటుంటారు కదా...!

నిజానికి టైం అనేదే వేస్టు...అన్నారు.

అద్భుతం అనిపించింది ఆ మాట...

కాలంలో కాలాతీతుడు ఈ గురువు...

కాబట్టే ఆ మాట అనగలిగారు.

నిజమేగా...

కాలమనేది గ్రహాలు, నక్షత్రాల ఆధారంగా సాపేక్షంగా మనం తయారుచేసుకొన్న ఒక ఊహాత్మకమైన వ్యవస్థ తప్ప కాలమనేదానికి అస్సలు ఉనికే లేదు కదా!

* * *

నేనెవడను? అని తెలుసుకో అని

భగవాన్ అంటే దాని అర్థం -

కుర్చీ 'ఉన్నది'

మంచం 'ఉన్నది'

శరీరం 'ఉన్నది'

ఇల్లు 'ఉన్నది'

'ఉన్నది' యే సకలంగా ఉన్నది.

లేకున్నది అంటే లేదని కాదు...

లేక "ఉన్నది" అని అర్థం.

ఉన్నది రెండురకాలుగా ఉన్నది -

1.ఉన్నట్లుగా

2.లేనట్లుగా

ఉన్నట్లుగా, లేనట్లుగా

ఉన్నది ఏదో "అదే నేను".

ఉండి లేనట్లు ఉండేది ఆకాశం

లేకనే ఉన్నట్లు ఉండేది ప్రపంచం.

గ్రహాలు, నక్షత్రాలు ఇవేవీ లేనప్పుడు

ఏముంటుందో "అదే నేను".

కాబట్టి నేనెవడను? అన్నదానికి సమాధానం -

ఉన్నది - ఏదో - అదే - నేనుగా - ఉన్నది.

* * *

నేనెవడను? అని భగవాన్ ప్రశ్నించలేదు...

అదొక పూర్ణమైన సమాధానంగానే అనుగ్రహించారు ఈ లోకానికి... "నేను - ఎవడను" అని.

"ఎవడు" కు

క్వచ్చన్ మార్క్ పెడితే ప్రశ్న.

ఫుల్ స్టాప్ పెడితే అదే సమాధానం.

వాక్కుకు, మనసుకు అందక ఉన్నవాడు "ఎవడో"

వాడి పేరు కూడా అదే "ఎవడు" అనేదే.

కాబట్టి "ఎవడు" అనేది నామవాచకం.

"ఎవడు" అనేదే నేను.

* * *

Who Am I ? అనే ప్రశ్నకు

Iam 'Who'. అనేదే సమాధానం.

* * *

అమ్మ ఒళ్లో నుంచి బ్రహ్మ ఒళ్లో చేర్పించాడు పరమేశ్వరుడు బాలసుబ్రహ్మణ్యుణ్ణి.

ఓం...అంటూ చదువు చెప్పడం మొదలు పెట్టాడు గురుబ్రహ్మ.

ఆగు అక్కడే...

ముందు "ఓం" అంటే అర్థం చెప్పు అన్నాడు

ఆ జ్ఞానశిశువు.

మౌనం వహించాడు ఆ గురువు.

ఖైదు చేశాడు బ్రహ్మను ఆ తుంటరి.

శివుడు పరుగెత్తుకొచ్చాడు...

తప్పు నాన్నా...! గురువును అలా చేయకూడదు...అన్నాడు కుమారస్వామితో.

అయితే నువ్వు చెప్పు ఓం అంటే ఏంటో...అన్నాడు.

"నాకు తెలియదు...నీకు తెలిస్తే చెప్పు" అన్నాడు శివుడు.

చెప్పేవాడు పైనుండాలి,

వినేవాడు క్రింద ఉండాలి...

క్రింద కూర్చో చెబుతా... అన్నాడు సుబ్రహ్మణ్యుడు.

కుమారునిపై మితిమీరిన వాత్సల్యంతో శివుడు మోకాలిపై కూర్చొని, వొంగి చెవి ఒగ్గాడు...

శివుని చెవిలో ఓంకార రహస్యాన్ని ఉపదేశించాడు ఆ బాల మురుగడు.

ఆ రహస్యం ఏమనేది ఇప్పటి వఱకూ తెలియదు లోకానికి.

కానీ జ్ఞానప్రసూనాంబికావతారులైన మన గురుదేవులవారికి శివకుమారుడు చెప్పిన

ఆ రహస్యాన్ని శివుడు చెప్పకుండా ఉంటాడా?

చెప్పాడు...

జ్ఞానాంబ ఆ రహస్యాన్ని

తిరిగి మాకు వెల్లడి చేసింది...

సద్గురు(వాక్)రూపంగా...

ఆ కార్తికేయుడు శివుని చెవిలో చెప్పిన

ఆ ఓంకారార్థ రహస్యమిదే -

లో-వెలి నిండి,

లో-వెలి లేక

ఉన్న ఓ సద్గురు స్వామి శివా!

నీలో నేనున్నాను.

నాలో నీవున్నావు.

* * *

భవబంధం అంటే ఏమి? అని ప్రశ్నించారు ఒకరు.

నేను పుట్టాను అనుకోవడం బంధం.

నేను పుట్టలేదనుకోవడం మోక్షం.

అన్నారు గురువుగారు.

మోక్షం కలదనుట - బంధం.

బంధం లేదనుట - మోక్షం.

గోధూళి వేళ గో-పొలం నుండి తిరిగొచ్చిన

గోవును కట్టేయడానికి సమయానికి పలుపు కనబడలేదు...

కానీ ఆ గొల్లవాడు దాని మెడను పలుపుతో చుట్టి, ఓ గుంజకు కట్టేసినట్టు నటించాడు.

ఆ పశువు తనను కట్టేశారనే భ్రాంతిలో

పొద్దున వరకు కదలక అక్కడే పడి ఉంది.

పొద్దున మళ్లీ అతడు పలుపు విప్పినట్టు యాక్షన్ చేశాడు...ఆవు మేతకు బయలుదేరింది...

అలాంటివే మనం అనుకునే బంధ-మోక్షాలు కూడా...

బంధం ఉండేది

నిజానికి ఉండి కాదు

ఉంది అనుకోవడం వల్ల.

బంధం ఉంది అని చెప్పేవాడూ అజ్ఞానే.

బంధం లేదు అని చెప్పేవాడూ అజ్ఞానే.

జ్ఞాని ఏమీ చెప్పడు.

* * *

గురువుగారు నా వైపు చిరునవ్వుతో చూస్తూ ఇలా ముఖ్యోపదేశం చేశారు -

బాబు తెలుసుకోవాల్సిన ముఖ్య విషయం ఏమంటే-

"బాబు అనేవాడే అసలు లేడు" అని...

బాబే లేడని బాబు తెలుసుకున్నాక

ఇక బాబు తెలుసుకునేది ఏముండాది? అన్నారు...

నేను ఉన్నాను అని ఉన్నవాడు - జీవుడు.

నేను లేను అని ఉన్నవాడు - దేవుడు.

ఉన్నవారిలో నేనొక్కణ్ణి అని ఉన్నవాడు - జీవుడు.

ఉన్నది నేనొక్కణ్ణే అని ఉన్నవాడు-దేవుడు.   ( అంటే నేను ఏదో ఒకచోట లేను, అంతటా వ్యాపించి ఉన్నాను అని ఉన్నవాడు-దేవుడు)

గురువు ఉండాడు అనుకునేవాడు శిష్యుడు.

గురువు లేడు అనుకునేవాడు గురువు.

ఉంది అనుకునేవాడు - గురువు.

లేదు అనుకునేవాడు - శిష్యుడు.

లేనిదానిని ఇచ్చేవాడు - దాత.

ఉన్నదానినే ఇచ్చేవాడు - గురువు.

* * *

ఉన్నదంతా నా పైన ఉందనుకో లేదా

ఉన్నదంతా నా క్రింద ఉందనుకో...

ఉన్నదంతా నా వెనుక ఉందనుకో లేదా

ఉన్నదంతా నా ముందు ఉందనుకో...

సమస్య తీరుతుంది...అన్నారు.

* * *

ఇంతలో పనిమనిషి  చీపుర  పట్టుకొచ్చి,

అందరూ బయటకెళ్ళండి...ఊడ్చేస్తాను...అంది.

విన్నదంతా వినేవానితో(బాబుతో) సహా ఊడ్చిపారేయండి...

అన్న బోధ నా అంతరాంతరాలలో వినబడింది...

లేచి, గురువు వద్ద శెలవు తీసుకున్నాం...

* * *